సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024

నాగోబా జాతర షురూ

మెస్రం వంశీయుల మహాపూజతో కేస్లాపూర్‌లో నాగోబా జాతర ప్రారంభమైంది. కొత్త కోడళ్లు గోవడ్ వద్ద శనివారం తమ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ఉపవాస దీక్ష విరమించారు. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. నాగోబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



- వివరాలు 8లో

న్యూస్‌రీల్

జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు

మంచిర్యాలటౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన తాండూరు తహసీల్దార్ డి.రోహిత్, ఆర్డీవో కార్యాలయ డీఏవో యు.జ్యోత్స్న, బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయ డీఏవో దేశ్‌పాండే శ్రీనివాస్, కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్ డి.సునిల్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు, భీమారం తహసీల్దార్ బి.విశ్వంభర్‌ను జగిత్యాలకు బదిలీ చేశారు. కుమురంభీం జిల్లా సిర్పూరు యూ తహసీల్దార్ ఎస్.రమేశ్, ఆసిఫాబాద్ తహసీల్దార్ కే.రమేశ్, జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ సి.రాజమనోహర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా జమ్మికుంట తహసీల్దార్ ఎం.రజిని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్‌రావు మండల తహసీల్దార్ పిప్పరి శ్రీనివాస్‌లను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. బెల్లంపల్లి తహసీల్దార్ బిట్ల సుధాకర్‌ను ఎన్నికల విధుల కోసం జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్/డీఏవోగా బదిలీ చేశారు.

నేడు టీజీ సెట్



బెల్లంపల్లి పరీక్ష కేంద్రంలో ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న టీజీ సెట్–2024కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాలు, మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు ఐదో తరగతిలో ప్రవేశానికి సంయుక్తంగా పరీక్ష నిర్వహిస్తున్నాయి. ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆదిలాబాద్ జిల్లాలో 8, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 9, మంచిర్యాల జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆదిలాబాద్ రీజియన్‌లో 3520 సీట్లు ఉండగా 8,844 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు.

పల్స్ పోలియోపై శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంపై డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ అతుల్ జిల్లాలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. మార్చి 3న ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి, 4 నుంచి 6వరకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అనిత, మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయనిర్మల, బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయపూర్ణిమ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రయోగ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పరీక్షలకు 229 మంది విద్యార్థులకు గాను 214 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 150 మందికి గాను 140 మంది హాజరుకాగా 10 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 105 మందికి గాను 103 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 80 మందికి గాను 79 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

బియ్యంలో పురుగులు


భీమారం: జైపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి పురుగులు పట్టిన బియ్యం పంపించడంతో ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదాం నుంచి వచ్చిన బస్తాల్లో బియ్యం పురుగులు పట్టి ఉండడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఎంఈవో రాధాకృష్ణమూర్తిని సంప్రదించగా పలు పాఠశాలకు పురుగులు పట్టిన బియ్యం వచ్చిన మాట వాస్తవమేనని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

‘గ్యారంటీ’ల ఊరట !

- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాకు నిరాశే..
- ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధుల్లేవ్
- ‘ప్రాణహిత’ ప్రాజెక్టు నిర్మాణానికి హామీ



గోదావరి వరదలతో మునిగిన పత్తి చేను(ఫైల్)



ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టు పైప్‌లైన్ (ఫైల్)

సర్కారు స్కూళ్లకు డిజిటల్ క్లాస్‌రూంలు

మందమర్రిలో ఏర్పాటు చేసిన లెదర్ పార్క్ షెడ్



భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేకంగా నిధులేమీ లేవు. ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం వాటా ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీనిచ్చినా.. ప్రస్తుతం ఆ జోలికి వెళ్లలేదు. ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో ఈ ప్రాంత ప్రస్తావన రాలేదు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుకు రూ.53,196కోట్లు ప్రకటించడంతో జిల్లాలోని ఆయా వర్గాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

పరిశ్రమలు, ఉపాధి..

ప్రభుత్వం తరఫున రెండు లెదర్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేస్తారో అనేది స్పష్టత రావాల్సి ఉంది. మందమర్రి పట్టణంలో లెదర్‌పార్కు పునరుద్ధరించాలనే డిమాండ్ ఉంది. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో 14వేల మంది నిరుద్యోగులు నమోదు చేసుకుని ఉన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగ నియామకాలు చేపడుతామని ప్రకటించడం ఊరట కలిగిస్తోంది.

గ్రామీణాభివృద్ధి, పట్టణాలు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.40,080కోట్లు ప్రతిపాదించడంతో జిల్లాలో 311 గ్రామ పంచాయతీలకు అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉంది. పురపాలక శాఖకు రూ.11,692కోట్లు కేటాయించడంతో జిల్లాలో ఏడు మున్సిపాలిటీల్లో అభివృద్ధిపై ఆశలు ఉన్నాయి. జిల్లా కేంద్రాల నుంచి గ్రామాలు, మండలాలకు డబుల్ లైన్‌కనెక్టివిటీ కోసం ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. గిరిజన, వంతెనలు లేని చోట్ల నిర్మిస్తామని ప్రకటించడంతో వేమనపల్లి, నెన్నెల, కోటపల్లి, చెన్నూర్, కాసిపేట, తాండూరు మండలాల పరిధిలో మారుమూల ప్రాంతాలకు రోడ్లు బాగుపడున్నాయి.

మండలానికో పబ్లిక్ స్కూల్

మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో జిల్లాలోని 18మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పడనున్నాయి. జిల్లాలో 10సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల మరమ్మతులకు మోక్షం కలుగనుంది. హాస్టళ్లకు సౌర విద్యుత్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు, విదేశీ విద్యానిధి ఎక్కువ మందికి ప్రయోజనం, 1050 స్కూళ్లలో డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.500కోట్లు ప్రతిపాదించారు. 65ఐటీఐ కాలేజీలు ఏర్పాటు చేస్తే ఇందులో జిల్లాకు వచ్చే అవకాశం ఉంది.

రైతు భరోసా

రూ.2లక్షల రుణమాఫీ కోసం కసరత్తు చేస్తామని మంత్రి భట్టి ప్రకటించారు. జిల్లాలో 1.10లక్షల మంది రైతులు మాఫీపై ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం 14వేల మంది రైతులకే రుణమాఫీ చేసింది. రైతుభరోసా కింద ఏడాదికి రూ.15వేలు అమలు చేస్తే రైతులకు ఉపయుక్తం కానుంది. ‘ఫసల్ బీమా యోజన’ అమలు చేస్తామని ప్రకటించారు. కౌలురైతులకు రైతుబీమా కల్పిస్తే జిల్లాలో 30వేలకు పైగా కౌలు రైతులకు మేలు జరుగనుంది. ఆయిల్‌ఫాం సాగు పెంచుతామని పేర్కొన్నారు. జిల్లాలో 3400 ఎకరాల్లో ఆయిల్‌ఫాం సాగు లక్ష్యం కాగా 1500 ఎకరాల వరకు సాగవుతోంది. ఇక రాష్ట్రంలో ‘విత్తన’ విధానం అమలు చేస్తామని ప్రకటించారు. వర్షాకాలంలో ప్రాణహిత, గోదావరి తీరాల్లో వరదలతో ముంపు రైతులకు నష్టపరిహారం, పరిష్కారం వంటివి ప్రస్తావనకు రాలేదు.

‘ప్రాణహిత’పై ఆశలు

ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మించి ఉమ్మడి జిల్లా రైతులకు సాగు నీరందించాలని ప్రభుత్వ లక్ష్యంగా ఉందని పేర్కొనడంతో ఇక్కడి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రాజెక్టు కోసం ఎటువంటి నిధులు ప్రతిపాదించలేదు. జిల్లాలో గూడెం ఎత్తిపోతలు, కడెం కాలువ, శాశ్వత మరమ్మతులు, పద్మాన్‌పల్లి ఎత్తిపోతలు, ఇతర వాటిపై ప్రస్తావన లేదు.

200యూనిట్ల ఉచిత విద్యుత్

గృహజ్యోతి కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్‌తో జిల్లాలో 3.47లక్షల కనెక్షన్లు ఉండగా, 2.10లక్షల వరకు 200యూనిట్ల లోపే వినియోగిస్తున్నారు. 24గంటల ఉచిత విద్యుత్‌తో జిల్లాలో 2లక్షల మంది రైతులకు ఊరటకలిగించింది.

ఇందిరమ్మ ఇళ్లకు కు రూ.5లక్షలు

ఇందిరమ్మ ఇళ్ల కింద ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5లక్షల సాయం మంత్రి ప్రకటించారు. ప్రతీ నియోజకవర్గానికి 3500ఇళ్లు నిర్మించనున్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో 10,500ఇళ్లు అందుబాటులోకి రానున్నాయి.

వాస్తవానికి దగ్గరగా బడ్జెట్



మంచిర్యాలటౌన్: వాస్తవానికి దగ్గరగా బడ్జెట్‌ను రూపొందించారు. విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, యువత, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా కల్పించేలా ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ బడ్జెట్ ప్రకటించి దళితబందు వంటి పథకానికి రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా చేసినట్లు కాదు. ఎస్సీ, బీసీ సబ్‌ప్లాన్‌కు అవసరమైన నిధులు ప్రతిపాదించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రజాపాలన కోసం ప్రవేశ పెట్టిన ప్రజాబడ్జెట్ ఇది.

– మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

వ్యవసాయ రంగానికి మొండిచేయి



మంచిర్యాలటౌన్: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని, రైతుబీమా, రుణమాఫీ, రైతుబంధు వంటి వాటికి కేటాయించాల్సిన నిధులను రూ.19 వేల కోట్లు మాత్రమే పెట్టారు. దా దాపుగా రూ.80 వేల కోట్లకు పైగా వీటికి నిధులు అవసరం అవుతాయి. నిరుద్యోగ భృతి, మహిళల కు ప్రతీ నెల రూ.2,500 ఇస్తామని చెప్పినా బడ్జెట్‌లో ఎక్కడా పొందుపర్చలేదు. ఆరు గ్యారంటీలకు సరిపడా నిధులు కేటాయించలేదు. పింఛన్ రూ.4 వేలకు పెంచుతామన్నా కేటాయింపులు లేవు.

– నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే

స్పష్టత లేని బడ్జెట్



మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపకల్పన చేసినట్లుగా ఉంది. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టినట్లుగా ఉంది. ఆరు గ్యారంటీల హామీతో ఎన్నికల్లో గెలుపొందినా బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించలేదు. జిల్లాకు కూడా ఎన్ని నిధులు కేటాయించారో స్పష్టత లేదు.

– రఘునాథ్ వెరబెల్లి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు

స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



మంచిర్యాలఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కేటాయించడం హర్షించదగిన విషయం. గత ప్రభుత్వం కేటాయింపుల కంటే ఎక్కువగా ఉంది. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి. ప్రతీ మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు మంచిదే.

– వంశీ, ప్రైవేట్ టీచర్, మంచిర్యాల

రుణమాఫీకి నిరాశే



మంచిర్యాలఅగ్రికల్చర్: అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా పథకం ద్వారా రూ.2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామని చెప్పినట్లుగా నిధులు కేటాయించలేదు. రెండు నెలలు గడిచినా రుణమాఫీపై ఆదేశాలు లేకుండా సాగదీత ధోరణిలో ఉన్నట్లు ఉంది. మొదటి బడ్జెట్‌లోనే రైతులను విస్మరించి వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులో నిరాశ పర్చింది.

– తోట మధు, నెన్నెల, రైతు

బోనస్ కేటాయింపు లేవి



మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించినట్లుగా వరి పంటకు మద్దతు ధరకు బోనస్ రూ.500 కేటాయింపుల్లేవు. గత కొన్నేళ్లుగా ఎద్దులకు బదులు ట్రాక్టర్ల వాడకం పెరిగింది. దీనికి అనుగుణంగా యంత్రాలు, సాంకేతిక రంగానికి నిధులు కేటాయించడం లేదు. వ్యవసాయ అనుబంధ రంగానికి పెద్దగా బడ్జెట్‌లో ఒరగబెట్టిందేమీ లేదు. రైతుబంధు కూడా మూడు ఎకరాలు వరకు రైతులకు మాత్రమే అందించారు. – బిరుదు రాజేష్, నెన్నెల, రైతు

సింగరేణికి నిరాశే



శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉంది. సింగరేణికి సంబంధించి ఎలాంటి మేలు చేసే అంశాలు లేవు. గని కార్మికులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య ఆదాయ పన్ను. వచ్చిన జీతంలో సగం ఆదాయ పన్నుకే పోతుంది. కోలిండియాలో మాదిరిగా సింగరేణిలో కూడా అలవెన్సులపై ఐటీ మాఫీ చేయిస్తే కొంత ఊరట ఉంటుంది. అలాంటి నిర్ణయాలు ఏవీ లేవు. కార్మికులకు స్వంతింటి పథకం కల్పించాలి.

– పీ.వినోద్‌కుమార్, హెడ్‌ఓవర్‌మెన్, శ్రీరాంపూర్

ఖాళీల భర్తీకి కసరత్తు

- జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల వివరాలు సేకరణ
- భర్తీ చేస్తే లబ్ధిదారులకు మేలు



అంగన్‌వాడీ కేంద్రం(ఫైల్)

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయా(సహాయకులు)ల కొరతతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందకుండా పోతోంది. కొన్నేళ్లుగా ఖాళీలు భర్తీ చేయకపోవడం, 73మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చింది. అందులోని సహాయకులను పూర్తి స్థాయి టీచర్లుగా మార్చడంతో 73 ఆయాల ఖాళీలు కొత్తగా ఏర్పడ్డాయి. టీచర్లు, ఆయాల ఖాళీలు ఎక్కువగా ఉండడంతో పక్కనే ఉన్న ఇతర అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో టీచరు రెండు కేంద్రాలను పర్యవేక్షిస్తుండడం ఇబ్బందిగా మారుతోంది. విధులు నిర్వర్తించే సిబ్బందికి అదనపు భారం, మరోవైపు పూర్తి స్థాయి పర్యవేక్షణ లోపించి కొన్ని కేంద్రాలు ఉన్నాయా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌ఓలుగా, ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాలకు విధులు కేటాయిస్తుండడం, ప్రజాపాలన వంటి కార్యక్రమాల్లో దరఖాస్తులు స్వీకరించడం వంటి విధులు, సర్వే పనులు అప్పగింతతో పూర్తి స్థాయిలో టీచర్లు విధులకు న్యాయం చేయకపోతున్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల భర్తీకి ప్రభుత్వం అన్ని జిల్లాల నుంచి ఖాళీల వివరాలు సేకరించడంతో భర్తీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మెరుగైన సేవలకు దోహదం

జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 893 మంది టీచర్లు ఉండగా 76ఖాళీలు, 729మంది ఆయాలు ఉండగా 240 ఖాళీలు ఉన్నాయి. ఖాళీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో పూర్వ ప్రాథమిక విద్య, బాలల ఎదుగుదల, పర్యవేక్షణ, టీకాలు, ఇతరత్రా సేవలు లబ్ధిదారులకు అందకుండాపోతున్నాయి. ప్రస్తుతం నూతనంగా అంగన్‌వాడీ టీచర్ల ఎంపిక కోసం ఖాళీల వివరాలు సేకరించగా గతంలో పదో తరగతి ఉత్తీర్ణత అర్హత కాగా ప్రస్తుతం ఇంటర్మీడియెట్ తప్పనిసరి చేశారు. ఆయాలకు పదో తరగతి ఉత్తీర్ణత ఉంటే సరిపోతుంది. విద్యార్హతల ఆధారంగానే ఎంపిక ప్రక్రియ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తే వచ్చే విద్యాసంవత్సరానికి టీచర్లు, ఆయాలు అందుబాటులోకి వచ్చి మెరుగైన సేవలు అందే అవకాశం ఉంది.

జిల్లాలో..

అంగన్‌వాడీ కేంద్రాలు	969
గర్భిణులు	4,740
బాలింతలు	3,531
3 ఏళ్లలోపు చిన్నారులు	24,578
3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు	11,607

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, టీచర్లు, ఆయాల ఖాళీల వివరాలు

ప్రాజెక్టు పేరు	మొత్తం కేంద్రాలు	ప్రస్తుత టీచర్లు	టీచర్ల ఖాళీలు	ప్రస్తుత ఆయాలు	ఆయాల ఖాళీలు
బెల్లంపల్లి	279	267	12	226	53
చెన్నూరు	245	222	23	174	71
లక్సెట్టిపేట	203	189	14	151	52
మంచిర్యాల	242	215	27	178	64
మొత్తం	969	893	76	729	240

గ్రూపు-4 ఫలితాల్లో మెరిశారు

దండేపల్లి/మంచిర్యాలటౌన్: గ్రూపు–4 ఫలితాల్లో జిల్లాకు చెందిన అభ్యర్థులు ప్రతిభకనబర్చారు. ఉత్తమ ర్యాంకులతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో మెరిశారు. దండేపల్లికి చెందిన ఇద్దరు, మంచిర్యాలకు చెందిన ఒకరు మెరుగైన ర్యాంకులు సాధించారు.

ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చదివి..



దండేపల్లికి చెందిన పెండ్యాల సత్యనారాయణ కుమారుడు సాయికిరణ్ ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చదివాడు. అగ్రికల్చర్ అధికారి ఉద్యోగంతోపాటు మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షలు రాశాడు. గ్రూప్–4లో 194 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 305, జిల్లా స్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. మొదటి ప్రయత్నంలో ప్రభుత్వ కొలువు రావడం సంతోషంగా ఉందని తెలిపాడు.

– పెండ్యాల సాయికిరణ్, దండేపల్లి

ప్రభుత్వ కొలువే లక్ష్యంగా..



నాన్న బొలిశెట్టి రాజన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. నేను కూడా ప్రభుత్వ కొలువు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాను. దానికి తగ్గట్టుగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే క్రమంలో గ్రూప్–4 పరీక్ష రాశాను. ఇందులో 191 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 540, జిల్లా స్థాయిలో 22 ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. కష్టపడి చదివితే విజయం తప్పక వరిస్తుంది.

– బొలిశెట్టి సచిన్ రాహుల్, దండేపల్లి

క్రాంతికి 131వ ర్యాంకు



జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలకు చెందిన నాగుల క్రాంతికుమార్ గ్రూప్–4 పరీక్షలో 131వ ర్యాంకు సాధించాడు. సింగరేణి ఎస్‌అండ్‌పీసీ డిపార్టుమెంటు ఎస్సార్పీ ఏరియాలో పనిచేస్తున్న బానేష్, దుర్గ దంపతుల కుమారుడు క్రాంతి హైదరాబాద్‌లో 2019లో బీటెక్(ఈసీఈ) పూర్తి చేసి గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ పరీక్షలో 60వ ర్యాంకు సాధించాడు. గత ఏడాది గ్రూప్–1కు సిద్ధమవుతూ గ్రూప్–4కు నేరుగా హాజరు కాగా 131వ ర్యాంకు రావడం ఆనందంగా ఉందని తెలిపాడు. భవిష్యత్తులో గ్రూప్–1 సాధించడమే తన లక్ష్యమని, అందుకోసం ప్రిపేర్ అవుతున్నట్లు పేర్కొన్నాడు.

– నాగుల క్రాంతి కుమార్, పాతమంచిర్యాల

‘పది’లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్, డీఈవో యాదయ్య, అధికారులు


- జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఈవో ఎస్.యాదయ్యతో కలిసి విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు–సన్నద్ధత సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ పాటించాలని, ప్రతీ పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఉంచాలని, బియ్యం నిల్వలు రిజిష్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. చెడిపోయిన, పురుగుపట్టిన బియ్యం వస్తే తహసీల్దార్, డీఈవోకు రాతపూర్వకంగా తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విభాగం సహాయ కమిషనర్ దామోదర్‌రావు, డీసీఈబీ కార్యదర్శి భీమ్‌రావు, సహాయ కార్యదర్శి కుమారస్వామి, విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

‘ఉపాధి’ పని కల్పించాలి

పాతమంచిర్యాల: ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద శాతం పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి బి.శేషాద్రితో కలిసి ఏపీవోలు, ఈసీలు, ఏపీఎంలు, సెర్ప్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు త్వరతగతిన పూర్తి చేయాలని, కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు.

సర్కారు బడులకు పీఎంశ్రీ నిధులు



మంచిర్యాల మోడల్‌స్కూల్‌భవనం

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద 2023–24 విద్యా సంవత్సరానికి నిధులు మంజూరు చేసింది. అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, భవనాల మరమ్మతుల(మేజర్ రిపేర్)కు పరిపాలన అనుమతినిచ్చిన ప్రభుత్వం తాజాగా నిర్వహణ, కరాటే కేరీర్ గైడెన్స్ శిక్షణ కోసం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాల్సి ఉంది. జిల్లా నుంచి మొదటి విడతలో 19 పాఠశాలలు జాతీయ స్థాయిలో ఎంపికయ్యాయి. ఇందులో కొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, మేజర్ మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. ఒక్కో అదనపు తరగతి, సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి రూ.16లక్షలు మంజూరయ్యాయి. భవనాల మరమ్మతులకు రూ.4.50లక్షలు మంజూరు చేశారు. తాజాగా పాఠశాలల నిర్వహణ కింద నిధులు మంజూరు చేశారు. విద్యార్థులకు శుద్ధమైన తాగు నీరు, ప్రయోగశాల, డిజిటల్ గ్రంథాలయం, క్రీడా సామగ్రి తదితర అవసరాల్లో భాగంగా నిధులు విడుదల చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.17,49,207 విడుదల చేశారు. 100 నుంచి 250 ఉన్న ఆరు స్కూళ్లకు రూ.75,000 చొప్పున రూ.4,50,000 కేటాయించారు. 250 నుంచి 1000 విద్యార్థులున్న 13 పాఠశాలలకు రూ.99,939 చొప్పున రూ.12,99,207 కేటాయించారు. రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పథకంలో భాగంగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా 15 పాఠశాలలకు రూ.30వేల చొప్పున రూ.4,50,000 ఇచ్చారు. మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లో ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి..? ఉపాధి అవకాశాలు..? ఎలా ప్రణాళికలు రూపొందించుకోవాలో అవగాహనకు పీఎంశ్రీ కింద కేరీర్ గైడెన్స్ ఇవ్వనున్నారు. ఇందుకు అవసరమైన 17 పాఠశాలలకు రూ.4,752 చొప్పున రూ.80,784 మంజూరయ్యాయని సెక్టోరల్ అధికారి యశోద తెలిపారు. నిబంధనల మేరకు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నెల్లూరు రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల వాసి మృతి


రూప (ఫైల్)

మంచిర్యాలక్రైం: నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన గోలి రూప (36) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నైలో స్థిరపడిన రూప శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఉంటున్న తన తల్లిని చూసేందుకు ఓ ప్రైవేటు బస్సులో బయలుదేరింది. టోల్‌ప్లాజా వద్దకు రాగానే బస్సు, లారీ ఢీకొన్నాయి. ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో రూప అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త కస్యాప్, కుమారుడు సిద్దార్థ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఎస్కే సిరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్లి తిరిగివస్తుండగా పాత బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో సిరాజ్‌తో పాటు అతని భార్య ఇసాత్‌బేగం, కుమారెత్త సోనా, కుమారుడు అజాంకు గాయాలయ్యాయి. వెంటనే 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరి రిమాండ్

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రామక్క, పోసమ్మలను బైండోవర్ ఉల్లంఘన కేసులో రిమాండ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ బాబ తెలిపారు. గతంలో ఇద్దరూ గుడుంబా అమ్ముతుండగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, మళ్లీ గుడుంబా విక్రయిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘించినందుకు తహసీల్దార్ రాఘవేంద్రరావు నోటీసులు జారీ చేసి జరిమానా చెల్లించాలని చెప్పినా చెల్లించక పోవడంతో బైండోవర్ కాలపరిమితి వరకు జైలుశిక్ష విధించగా రిమాండ్ నిమిత్తం ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి శివారులో పేకాట స్థావరంపై శనివారం దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9,500 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బంది రమేశ్, మధు, సంజీవ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

‘కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి’

మంచిర్యాలఅర్బన్: తాండూర్ మండలం కస్తూరిబా ఇన్‌చార్జి ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, వీజేఎస్ జిల్లా గోపాల్, షేక్ సల్మాన్ పాషా, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతర షురూ

- 202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)
- ఉపవాస దీక్ష విరమించిన భేటింగ్ కోడళ్లు
- తరలి వస్తున్న భక్తజనం


జాతరకు తరలి వస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాస్య అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభమైంది. మొదటి రోజు శనివారం ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. ఈ నెల 15 వరకు అధికారికంగా...మరో రెండు రోజుల పాటు అనధికారికంగా జాతర కొనసాగుతుందని ఈవో రాజమౌళి తెలిపారు

202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకున్నారు. కొత్త కోడళ్లు తెల్లని దుస్తులు ధరించి భేటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 202 మంది కోడళ్లకు మెస్రం వంశ మహిళా పెద్దల సహాయంతో సతీదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట నుంచి శనివారం తెల్లవారు జామువరకు భేటింగ్ పూజలు నిర్వహించారు.

ఉపవాస దీక్షలు విరమణ

శుక్రవారం ఉదయం నుంచి కఠోర ఉపవాస దీక్షలతో ఉన్న కొత్త కోడళ్లు శనివారం ఉదయం ఒకరి వెనుక ఒకరు వరుసక్రమంలో మర్రిచెట్టు వద్దగల కోనేరు బావివద్దకు వెళ్లి నీటిని సేకరించారు. ఆ నీటితో గోవడ్ వద్ద దేవతలను శుద్ధిచేసి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించిన అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు.

నాగోబాను దర్శించుకున్న అతిథులు

శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజ అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా, ఎస్పీ గౌస్ ఆలం దంపతులు, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నాగోబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెస్రం వంశీ యులు అతిథులను శాలువాతో సత్కరించి నాగో బా ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశ పటేల్ మెస్రం వెంకట్‌రావ్, పెద్దలు మెస్రం బాదిరావ్, చిన్ను పటేల్, కోసు కటోడ, కోసేరావ్, మెస్రం ఉద్యోగులు మెస్రం దేవ్‌రావ్, మెస్రం మనోహర్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం సోనేరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రవెల్లి: నాగోబా దర్బార్ హాల్‌లో శనివారం రాత్రి ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని అంతపూర్, గుడిహత్నూర్ మండలంలోని మచ్చపూర్ కళాకారులు డెంస, గుస్సాడీ నృత్యం చేయడంతో పాటు గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన మర్సుకోల కలబాయి బృందం సభ్యులు కిక్రి వాయిస్తూ పాటలు పాడారు.


నాగోబా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్,కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలాం


ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా దంపతులకు నాగోబా ప్రతిమ ఇస్తున్న పటేల్ వెంకట్‌రావ్


జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు నాగోబా ప్రతిమను అందిస్తున్న మెస్రం వంశీయులు


గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాబృందం సభ్యులు


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్


భేటింగ్‌కు హాజరైన మెస్రం వంశ కొత్త కోడళ్లు


కోనేరు నుంచి నీటిని సేకరించడానికి వస్తున్న కొత్త కోడళ్లు

మోగనున్న పెళ్లిబాజాలు

- నేటి నుంచి శుభ ముహూర్తాలు
- ఈ నెల 10 నుంచి మాఘమాసం



ఆసిఫాబాద్‌అర్బన్: నేటి నుంచి శుభముహూర్తాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 10 నుంచి మాఘ మాసం ప్రారంభమవుతూ మంచి రోజులను వెంట తీసుకువస్తోంది. 11వ తేదీనుంచి పెళ్లిసందళ్లు ప్రారంభం కానున్నాయి. మాఘం, పాల్గుణం, చైత్ర మాసాల్లో (ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్) దాదాపు 35 నుంచి 40వరకు ముహూర్తాలు ఉన్నాయని వేద పండితులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 26 తర్వాత దాదాపు మూడు నెలల పాటు (ఆగస్టు వరకు) ముహూర్తాలు లేవు. దీంతో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే ఎక్కువ సంఖ్యలో శుభ కార్యాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే చాలా కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యాల తేదీలు చూసుకున్నారు.

పలువురికి ఉపాధి

ఈ మూడు నెలల్లో శుభ ముహూర్తాలు ఉండడంతో పలువురికి ఉపాధి లభించనుంది. పెళ్లిళ్లు, ఉపనయనాలు, గృహప్రవేశాలు, పుట్టు వెంట్రుకలు, ఇతర శుభకార్యాలు జరుగనున్నాయి. పురోహితులు, బ్యాండ్‌మేళా, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్, టెంట్‌హౌజ్, ఫంక్షన్ హాల్, వర్కర్లకు ఉపాధి లభించనుంది. బట్టలు, బంగారం, తదితర వ్యాపారులకు ఆదాయం సమకూరనుంది.

ముహూర్తపు తేదీలు

మాఘమాసం: ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 28, 29

పాల్గుణమాసం: మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4

చైత్రమాసం: ఏప్రిల్ 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26

ఈ తేదీలు దాటితే తిరిగి ఆగస్టులోనే మళ్లీ శుభముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు పేర్కొంటున్నారు.

భర్త ఇంటి ఎదుట ఆందోళన

రామకృష్ణాపూర్: భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళనకు దిగిన సంఘటన పట్టణంలోని ఏజోన్ ఏరియాలో శనివారం చోటు చేసుకుంది. కాజీపేట్‌కు చెందిన వందనకు పట్టణానికి చెందిన ఊట్ల సంతోష్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. దంపతులకు కుమార్తె సంతానం. ఇన్నాళ్లూ సాఫీగానే సాగిన కాపురంలో అత్త పుష్ప, మామ ఆశీర్వాదం కారణంగా వివాదాలు తలెత్తాయని వాపోయింది. ఇటీవలే సంతోష్‌కు నర్సింగ్ ఉద్యోగం వచ్చిందని ఈ క్రమంలో శనివారం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగంలో ఉన్న తన భర్త దగ్గరకు కూతుర్ని తీసుకుని వెళ్లగా ఇంట్లో అమ్మానాన్నలకు నువ్వంటే ఇష్టంలేదని, వేరే పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను పంపించాడని విలపిస్తూ చెప్పింది.

జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం

బెల్లంపల్లి: జార్ఖండ్‌లోని రాంచీలో ఈనెల 9న జరిగిన జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో ముగ్గురు విద్యార్థులతో కూడిన రాష్ట్ర జట్టు కాంస్యపతకం సాధించింది. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వర్షిత్, ఇతర విద్యార్థులు సింహాచలం, అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు. రాజస్థాన్ జట్టు ప్రథమ బహుమతి, మహారాష్ట్ర జట్టు ద్వితీయ బహుమతి, తెలంగాణ రాష్ట్ర క్రీడాకారుల జట్టు తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ అంజయ్య, పీడీ బాబురావు తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

జన్నారం: సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 టీంలు పోటీలలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు సాయి, గంగాసింగ్, సుమన్ తెలిపారు. పోటీలు ఈనెల 18 వరకు జరుగుతాయని, అదే రోజు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు అందించనున్నట్లు తెలిపారు.

కుట్టుశిక్షణ ద్వారా జీవనోపాధి

లక్సెట్టిపేట: మహిళలు కుట్టుశిక్షణ నేర్చుకోవడం ద్వారా జీవనోపాధి దొరుకుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ మోతీలాల్ అన్నారు. శనివారం మండలంలోని చందారంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతూ వారికి కుట్టుశిక్షణ అందించడాన్ని అభినందించారు. అనంతరం ముప్పై మంది అక్షర వాలంటీర్లకు పరీక్ష నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ పీవో పురుషోత్తం నాయక్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, డీఆర్పీలు జనార్దన్, వెంకటేశ్వర్లు, అశోక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకత పెంచితేనే భవిష్యత్

- ఎస్‌వోటూ జీఎం రఘు కుమార్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంచితేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూ జీఎం కే.రఘుకుమార్ తెలిపారు. శనివారం ఆర్కే న్యూటెక్ గనిపై మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పని స్థలాల్లో రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. యంత్రాల పనిగంటలు మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏజెంట్ రాముడు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, అరవిందరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, గని మేనేజర్ స్వామి రాజు, రక్షణాధికారి కొట్టే రమేశ్, పిట్ ఇంజనీర్ రాజగోపాలచారి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఖని’లో ఏటీఎం చోరీ.. ఇక్కడ పరికరాలు

మందమర్రిరూరల్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఏటీఎం చోరీకి వినియోగించిన పరికరాలను మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అందుగులపేట జాతీయ రహదారి పక్కన శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేయడంతో వారు గోదావరిఖనిలో ఏటీఎం చోరీకి వినియోగించిన పరికరాలుగా భావించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీంతో అందుగులపేటకు చేరుకుని గ్యాస్‌కట్టర్‌తోపాటు ఏటీఎం మిషన్‌కు సంబంధించిన డబ్బులు నిల్వ ఉంచే బాక్సులు, పరికరాలు స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పరికరాలు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో పోలీసులు అత్యంత గోప్యంగా వివరాలు సేకరిస్తున్నారు.


అందుగులపేట వద్ద పడేసిన పరికరాలు

కానిస్టేబుల్ ఉద్యోగాల పేరిట టోకరా

- రూ. 5.5 లక్షల వసూలు
- యువతి అరెస్టు

కరీంనగర్‌క్రైం:ఉద్యోగాలు ఇప్పిస్తామని ముగ్గురి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఓ యువతిపై కేసు నమోదు చేసినట్లు శనివారం టూటౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు యువతులు కరీంనగర్‌లోని ముకరాంపురలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారు. గతేడాది అక్టోబర్‌లో అదే హాస్టల్‌లోని వారి గదిలో హన్మకొండకు చెందిన పి.ప్రత్యూష చేరింది. తాను కోర్టు కానిస్టేబుల్‌నని పరిచయం చేసుకొని నకిలీ ఐడీకార్డు, పోలీసు డ్రెస్‌తో ఉన్న ఫొటోలు చూపించింది. తాను కూడా సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని తెలిపింది. డబ్బులు పెట్టి పోలీసు ఉద్యోగం పొందానని నమ్మించింది. మీరు కూడా డబ్బులు ఇస్తే కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపించింది. ఇద్దరు యువతులతోపాటు మరో యువకుడి వద్ద పలు దఫాలుగా రూ.5.5 లక్షలు వసూలు చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ప్రత్యూషను నిలదీశారు. కొంత డబ్బులు తిరిగి చెల్లించి మిగతా డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆదివాసీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

కాసిపేట: ఆదివాసీ సంప్రదాయాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, వాటిని కాపాడుకుంటూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఓరియంట్ సిమెంట్ కంపనీ కార్మిక సంఘం నాయకుడు కొక్కిరాల సత్యపాల్ రావు అన్నారు. శనివారం కుర్రెఘడ్‌లో ఆదివాసీలు నిర్వహించే పాహుండి కూపర్ లింగుస్వామి జాతరకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి వెంకటేష్, కనకరాజు, జనార్ధన్, తుడుందెబ్బ రాష్ట్ర పధాన కార్యదర్శి జంగు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనుకుల రాకేష్, ప్రధాన కార్యదర్శి జంగిలి రమేష్, నాయకులు షాకీర్, తిరుపతి, దుర్గం గణేష్, ఆదివాసీలు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



మంచిర్యాలక్రైం: జిల్లాకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఎం వెంకటరమణతో పాటు హైదరాబాద్, మంచిర్యాలకు చెందిన మరో నలుగురు కారులో లంబసింగి, అరకు, వైజాగ్, పాడేరు, ప్రాంతాల్లో పర్యటించేందుకు శనివారం వెళ్లారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జీమడుగుల మండలం వంజరి సమీపంలోని సంజీవనిఘాట్ వద్దకు రాగానే ఒక్కసారిగా కారులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమై కారును అక్కడే నిలిపి కిందికి దిగి పారిపోవడంతో సురక్షితంగా బయటపడ్డారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


సమ్మయ్యను అభినందిస్తున్న డీసీపీ

బెల్లంపల్లి: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 9న నిర్వహించిన ఐదో జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో బెల్లంపల్లి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్య సత్తా చాటాడు. 45 ఏళ్ల విభాగంలో నిర్వహించిన డిస్కస్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. షార్ట్‌పుట్ పోటీల్లో నాలుగోస్థానంలో నిలిచాడు. సమ్మయ్యను శనివారం తన డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ పంతాటి సదయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి

కోటపల్లి: రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని అభివృద్ధి చెందాలని భారతీయ కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ వీకేసింగ్ అన్నారు. శనివారం ఆ లుగామలో కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. రైతుల అభివృద్ధికి ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా భారత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌ల సాయంతో కలుపు మందులు, పురుగు మందులు, తెగులు మందులు స్ప్రే చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్ఎస్.బల్లోలి, కేఎస్ రెడ్డి, శ్రీదేవి శంకర్, నోడల్ అధికారి టి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

షాదీఖానా స్థలం కబ్జా కాకుండా చూడాలి

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని షంషీర్ నగర్ బస్తీలో షాదీఖానా స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని మైనార్టీ నాయకులు శనివారం ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువైన స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి నకిలీ పత్రాలు సృష్టించారన్నారు. వాటి ఆధారంగా కోర్టులను మోసం చేస్తూ స్థలాన్ని అమ్మకానికి పెడుతున్నారన్నారు. స్పందించిన ఆర్డీవో విచారణ జరిపి కబ్జా దారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్వర్‌ఖాన్, షరీఫ్, ఎండీగౌస్, అమానుల్లాఖాన్, జావీద్‌ఖాన్, అఫ్జల్ బాబా, సాబీర్,పాల్గొన్నారు.

‘విద్యారంగానికి అరకొర నిధులు’

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. శనివారం మంచిర్యాల మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సవరించి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు రాజ్‌కుమార్, సిద్ధార్థ, కార్తీక్, అజయ్ పాల్గొన్నారు.